




కార్తీక పౌర్ణమి సందడి

కార్తీకపౌర్ణమి సందర్భంగా సిద్దిపేట జిల్లాలో గురువారం సందడి నెలకొన్నది. పూజకు అవసరమైన పూలు, ఉసిరిస్నానాల కోసం ఉసిరికాయలు, ఉసిరి కొమ్మల కొనుగోళ్లతో రోడ్లన్నీ కోలాహలంగా మారాయి. కొందరు వ్యాపారులు పూల ధరలను అమాంతం పెంచారు.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

శుక్రవారం 15 నవంబరు 2024

పండుగలా బాలల దినోత్సవం

● హాజరైన కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల సంరక్షణకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ బాలబాలికలనుద్దేశించి మాట్లాడారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందుకు అనుగుణంగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి వారిని అభినందించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా సంక్షేమ అధికారి శారద, అదనపు డీసీపీ మల్లారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులతో కలెక్టర్ మనుచౌదరి, అధికారులు

ఇది నా థర్డ్ ఇన్నింగ్స్

● మానవసేవలో తెలియని ఆనందం ఉంది ● చిన్నారుల గుండెకు భరోసాగా సత్యసాయి ఆసుపత్రులు

● ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం

● దేశవిదేశాల నుంచి సర్జరీల కోసం వస్తున్నారు

● ట్రస్టులో సభ్యుడిగా ఉన్నందుకు గర్వపడుతున్నా : మాజీ క్రికెటర్, అంతర్జాతీయ వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్

● కొండపాకలోని పిల్లల హృద్రోగ రీసర్చ్ సెంటర్ సందర్శన

సిద్దిపేట, నవంబరు 14, ఆంధ్రజ్యోతి : 'మానవసేవ రూపంలో నా థర్డ్ ఇన్నింగ్స్ కొనసాగిస్తున్నాను' అని టీమిండియా మాజీ క్రికెటర్, అంతర్జాతీయ క్రికెట్ కామెంటేటర్ సునీల్ గవాస్కర్ పేర్కొన్నారు. క్రికెటర్‌గా మొదటి ఇన్నింగ్స్, కామెంటేటర్‌గా రెండో ఇన్నింగ్స్ పూర్తి చేశానని చెప్పారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి, చిన్నారుల హృద్రోగ పరిశోధన కేంద్రాన్ని గురువారం గవాస్కర్ సందర్శించారు. ముందుగా ఆసుపత్రి వెలుపల ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఛైర్మన్ శ్రీనివాస్, ట్రస్టీ సభ్యులు వివేక్‌గౌడ్‌తో కలిసి ఆసుపత్రిలో కలియతిరిగారు. అధునాతన పరికరాలను పరిశీలించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. వారికి చాక్లెట్లు అందజేసి ఫొటోలు దిగారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో



ఆసుపత్రిలో చిన్నారులతో సునీల్ గవాస్కర్, ఆస్పత్రి ఛైర్మన్ శ్రీనివాస్



ఆసుపత్రిలో చేరిన చిన్నారులతో తల్లిదండ్రులు

ఆయన మాట్లాడారు. ఇక్కడ చికిత్స పొందుతున్న చిన్నారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. సత్యసాయి ఆసుపత్రుల్లో 99శాతానికి పైగా సక్సెస్ రేటు ఉందన్నారు. ఇలాంటి ఆసుపత్రుల్లో ట్రస్టు సభ్యుడిగా ఉండడం తనకు గర్వకారణమన్నారు. దేశ, విదేశాల నుంచి సమస్యలతో వచ్చిన చిన్నారులను పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్న ఘనత ఈ సంస్థకు దక్కుతుందన్నారు. రూపాయి కూడా ఖర్చు కాకుండా ఖరీదైన వైద్యం, శస్త్ర చికిత్సలు చేస్తున్న నిర్వాహకులను ప్రశంసించారు.

గవాస్కర్ నోట.. జై తెలంగాణ

గవాస్కర్ తన ప్రసంగాన్ని ముగించే ముందు "జైహింద్ నినాదంతో పాటు జై తెలంగాణ" అనడంతో చప్పట్లు మార్మోగాయి. తన ప్రసంగం సమయంలో 'ఓం నమశ్శివాయ' అంటూ మొబైల్ ఫోన్ రింగైంది. దీంతో ఫోన్ మోగిన వ్యక్తివైపు చూసి నమస్కారం అంటూ సంబోధించారు. ఇక ఆసుపత్రిలో సందర్శించే సమయంలోనూ చిన్నారులతో సరదాగా సంభాషించారు. గవాస్కర్ గురించి సత్యసాయి ట్రస్టు సిబ్బంది ప్రస్తావిస్తూ ఆయన గొప్ప క్రికెటరే కాకుండా మానవతావాది అని, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత అని కొనియాడారు. ఈ విషయంపై గవాస్కర్ స్పందిస్తూ తాను

మిగతా 7వ పేజీలో...

చిన్నారుల గుండెకు అండ

● అడ్మిట్ నుంచి డిశ్చార్జి వరకు అన్నీ ఉచితమే

● కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో సకల సౌకర్యాలు

8

మద్యం మీద ఉన్న శ్రద్ధ ధాన్యం కొనుగోళ్లపై లేదు

● తాగుబోతుల తెలంగాణగా మార్చబోతున్న సీఎం రేవంత్ రెడ్డి

● ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తుంది : మాజీ మంత్రి హరీశ్‌రావు

నంగునూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ రైతులు పండించిన పంటలపై లేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పండించిన వడ్లు కొనుగోలు చేయకపోతే అధికారులను అడగడం లేదని, కానీ మద్యం అమ్మకాలు జరగకపోతే ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐలను ట్రాన్స్ ఫర్ చేస్తున్నారని ఆరోపించారు. మద్యం అమ్మకాలు చేయకపోతే చర్యలు తీసుకుంటున్న సీఎం, వడ్లు కొనుగోలు చేయకపోతే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ఆయన ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం, మిల్లుల అనుసంధానం ఆలస్యం, డబ్బులు ఆలస్యంగా ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయి ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్మి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.2,300 ఉంటే రైతు లు కేవలం రూ.1900కే ధాన్యాన్ని అమ్ముకోవాల్సి న పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాలో 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ఇక్కడి రైతులు పండించే వారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటును తర్వాత బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం నీటితో చెరువులు నింపి, 24 గంటల కరెంటు ఇచ్చి, మండలానికి ఓ మార్కెట్ కట్టించడంతో రైతులు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యా న్ని పండించారని తెలిపారు. తాగుబోతుల తెలంగాణగా మార్చేందుకు సీఎం చూస్తున్నాడని ఆరోపించారు. ప్రజలకు మద్యం తాగించేందుకు ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులకు ప్రాధాన్యత ఇవ్వట్లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న సర్కార్ ఎవరికోసం పని చేస్తుందని ప్రశ్నించారు. యాసంగికి ముందే రైతులకు రైతుబంధు, రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సన్నాలకు రూ.500 బోనస్ ఏమయిందని ప్రశ్నించారు. మహారాష్ట్రకు వెళ్లి ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నామని గొప్ప లు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా, అన్నింటినీ ఎదుర్కొని రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. చాలామంది రైతులు అప్పు లు తెచ్చి, భార్య మెడలోని బంగారం తాకట్టు పెట్టి మరీ బ్యాంకుల్లో రుణాలు కట్టారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలైనా రైతులకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ పాలనలో భూములకు విలువ దగ్గిపోయిందన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని,భూములు కొనే దిక్కు లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం, సన్న వడ్లకు సున్న.. దొడ్డు వడ్లకు గుండుసున్న పెట్టింది రైతులకు తీరని రైతులకు తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు.



నంగునూరు మండలం సిద్దన్నపేట మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

హైనా దాడిలో 13 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

మద్దూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): హైనా దాడిలో 13 గొర్రెలు మృతిచెందిన సంఘటన మండలంలోని రేబర్తిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు ఒగ్గు కొమురయ్య రోజూవారిలాగానే జీవాలను బుధవారం మేతకు తీసుకెళ్లొచ్చి షెడ్డులోకి వదిలాడు. ఉదయం వచ్చి చూసేసరికి గొర్రెలు చనిపోయి ఉన్నాయి. వెంటనే గ్రామ పెద్దలతో పాటు వెటర్నరీ వైద్యాధికారికి, ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు కొమురయ్య తెలిపాడు. వెటర్నరీ వైద్యాధికారి హరికిషన్ ఆధ్వర్యం లో పంచనామా నిర్వహించినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లింగమూర్తి తెలిపారు. సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో పంచాయతీ సెక్రటరీ మాధవ్‌జాదవ్, పశువైద్య కేంద్రం సబార్డినేటర్ సత్యం, మాజీ ఎంపీపీ యాద య్య, మాజీ సర్పంచ్ బొమ్మగాని శివయ్యగౌడ్, కాం గ్రెస్ మండల నాయకుడు పుల్లూరి రాజు ఉన్నారు.

ఉన్నత విద్యలో అగ్రగామిగా ఐఐటీ హైదరాబాద్

● భవిష్యత్ ఇంజనీర్లకు మైలురాయి

● కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మంజుదార్

కంది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఉన్నతవిద్యలో అగ్రగామిగా ఐఐటీ హైదరాబాద్ నిలిచిందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను శుక్రవారం ఆయన మెదక్ ఎంపీ మాదవనేని రఘునందన్‌రావుతో కలిసి సందర్శించారు. ఐఐటీహెచ్‌లోని విభిన్న విద్య, అత్యాధునిక పరిశోధనల గురించి తెలుసుకున్నారు. అనంతరం టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నావిగేషన్‌లో తయారవుతున్న డ్రోన్లను పరిశీలించారు. టీహన్‌లో డ్రైవర్ లెస్ టెక్నాలజీతో నడిచే షటిల్ వాహనంలో కేంద్రమంత్రి ప్రయాణించారు. ఐఐటీహెచ్‌లో కల్పనాచావ్లా పేరిట ఏర్పాటు చేసిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఐఐటీహెచ్ ప్రాంగణంలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుకాంత్ మంజుదార్ ప్రసంగించారు. మొదటితరం ఐఐటీలతో పోటాపోటీగా ఐఐటీహెచ్ పరిశోధనలు జరిపి అగ్రగామిగా ఖ్యాతి గడిస్తున్నదని పేర్కొన్నారు. ఎఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో జాతీయస్థాయిలో 8వ స్థానంలో ఐఐటీహెచ్ నిలవడం గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్ ఇంజనీర్లకు ఐఐటీహెచ్ మైలురాయిగా మారిందని పేర్కొన్నారు. జపాన్ సహకారంతో మన సాంకేతికతను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. ఉన్నత్ భారత్ అభియన్ వంటి అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా గణనీయమైన అచీవ్‌మెంట్‌ను అందుకున్నామని తెలిపారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్ స్థాపించిన కొద్దికాలంలోనే గణనీయ మన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. విద్యాపరమైన సాంకేతికతను అభివృద్ధి చేయడంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడాడారు.



ఐఐటీహెచ్‌లో హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మంజుదార్

భూ సర్వేను అడ్డుకున్న రైతులు

అక్కన్నపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం చౌటపల్లి వద్ద నిర్మించే ఇండస్ట్రీయల్ పార్క్ కోసం భూములను సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకుని ధర్నా చేపట్టారు. తమ భూములను ఇవ్వబోమని చెబుతున్నా ఎందుకు వస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూముల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎవరూ లేని సమయంలో భూములను సర్వే చేస్తున్నారని ఆరోపించారు. ఉన్న కొద్దిపాటి భూములను బలవంతంగా లాక్కొని తమ జీవితాలను నాశనం చేయొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి తమ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.



అక్కన్నపేట మండలం చౌటపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించొద్దని ధర్నా చేస్తున్న రైతులు



గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, చైర్మెన్ లింగమూర్తి

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ మనుచౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మనం ఏర్పరుచుకునే లక్ష్యం ఎప్పుడు లాంగ్ మారథాన్‌లా ఉండాలని, జీవితంలో పెద్దగోల్స్ పెట్టుకుని కష్టపడితే ఫలితం బాగుంటుందని కలెక్టర్ సూచించారు. తాను ఐఏఎస్‌కు ఎలా సెలక్ట్ అయ్యారనే విషయాన్ని, పరీక్ష కోసం ఎలా చదవాలి అనే అంశాలను తన స్వానుభవాలతో కలిపి వివరించారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడారు. గతంలో మాదిరిగా మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకుంటానని తెలిపారు. జిల్లా గ్రంథాలయాన్ని యువత వినియోగించుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటుగా మండల కేంద్రాల్లో గ్రంథాలయాల ఏర్పాటు చేసే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఇప్పటికే ఉన్నచోట్ల సరైన వసతులు, అవసరమైన పుస్తకాలు లేవని, ఆ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు సాకిఆనంద్, బొమ్మల యాదగిరి, గోపికృష్ణ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

● కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్

6



మాజీ సర్పంచ్ కుమారుడిపై హత్యాయత్నం?

● తొగుట మండలం లక్ష్మాపూర్‌లో ఘటన

● ఆలస్యంగా వెలుగులోకి

7



హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తులు బైక్‌పై పారిపోతూ సీసీ కెమెరాలో చిక్కిన దృశ్యం

రాజీవ్ రహదారి.. ఉపాధి దారి

● రోడ్డు పక్కన చిరువ్యాపారాలకు అడ్డా

● పండ్లు, కంకుల విక్రయంతో జీవనం

● రోజుకు రూ.500 వరకు సంపాదన

7



కార్లు ఆపి కొనుగోలు చేస్తున్న దృశ్యం

'గీతం'లో ముగిసిన పరిశోధనా మెథడాలజీ కోర్సు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14 : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాద్‌లో ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రీసెర్చ్ మెథడాలజీ కోర్సు (ఆర్ఎంసీ) ముగిసిందని కోర్సు సహ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ కుమార్ గురువారం తెలిపారు. ఆధునిక విద్యావసరాలకు సరిపోయే పరిశోధనా నైపుణ్యాలతో స్కాలర్లను సన్నద్ధం చేయడం లక్ష్యంగా దీనిని నిర్వహించామన్నారు. దేశంలోని పలు విద్యా సంస్థలకు చెందిన విశిష్ట అధ్యాపకులు పరిశోధన ప్రాథమిక అంశాల నుంచి గుణాత్మక పద్ధతులు, సంక్షిప్త పరిశోధన, సిద్ధాంత వ్యాస రచన, సాహిత్య సమీక్ష, నమూనా డిజైన్ అంశాలను పరిచయం చేశారు.


అలిరాజపేట గ్రామంలో పత్తి చేనులో అంతర పంటగా కంది

అంతర పంటపై ఆసక్తి

మొక్కజొన్న, పత్తి చేనుల్లో కంది సాగు

- మంచుతో చీడపీడలు ఆశించే ప్రమాదం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

జగదేవ్‌పూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటల్లో అంతరపంటగా కందిని సాగు చేస్తున్నారు. వరి, మొక్కజొన్న పంటల కన్నా కందుల ధర అధికంగా ఉండడంతో రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. కందిని సాగు చేయడం నుంచి మొదలు కోత వరకు కూలీల వినియోగం తక్కువగా ఉండడంతో రైతులు ఈ పంటను సాగు చేయడానికి ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా తేలికపాటి భూములు, ఎర్రనేలల్లో కంది పంట అనువైనది.

5 వేలకుపైగా ఎకరాల్లో కంది సాగు

సిద్దిపేట జిల్లాలో సుమారు 5వేల ఎకరాల్లో కంది పంటను సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల అంచనా. గజ్వేల్ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కుక్, వర్గల్, కుకునూరుపల్లి మండలాల్లో కంది పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న, పత్తి చేనులలో అంతర పంటగా వేశారు. కాగా ప్రస్తుతం కంది చేను పూత, పిందె దశలో ఉన్నందున రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మంచు అధికంగా పడుతుండడంతో కంది చేనుకు పురుగు అధికంగా వ్యాపించే ప్రమాదముంటుందని, దీని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుచుట్టూ పురుగు ప్రబలే ప్రమాదముందని, ఇది ఒక చేనుకు ఆశించి పక్క రైతుల చేనుకు వెళ్తుందని, నివారణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. కాగా ప్రస్తుతం కంది చేనుకు ఒక తడి నీటిని పెడితే కూడా ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కంది పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఆకుపై పచ్చ పురుగు నివారణ కోసం మోనోక్రోటోపాస్‌ను 1.6 మిల్లీలీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఆకు చుట్టు పురుగు తొలగిపోవడంతో పాటు వివిధ రకాల పురుగుల గుడ్లను కూడా నాశనం చేస్తుంది. మరుకమచ్చల పురుగు నివారణకు హెమామె క్లీనెంజోమెట్, ప్రొక్లెమ్ లేదా బెంజర్‌ను లీటరు నీటికి 0.4 గ్రాములను కలిపి పిచికారీ చేయాలి. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలను పాటిస్తే పంటను పురుగుల బారి నుంచి కాపాడి అధిక దిగుబడిని సాధించవచ్చు.

\- వసంతరావు,
మండల వ్యవసాయాధికారి, గజ్వేల్

రైతులకు ఇబ్బందులు రాకుండా

ధాన్యం కొనుగోలు చేయాలి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్, మిల్లర్ల విషయంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. రోజు సాయంత్రం జిల్లాల్లో జరిగిన కొనుగోలు నివేదికలను పంపించాలని అన్నారు. సన్నవడ్ల బోనస్ విషయంలో ఆలస్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం దిగుమతి కాకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలో 3.50 లక్షల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని, జిల్లా వ్యాప్తంగా 419 దాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 41,421 మెట్రిక్ టన్నుల వరిదాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. జిల్లాలో ఎక్కడ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, సివిల్ సప్లై డీఎం ప్రవీణ్, సివిల్ సప్లై అధికారి తనూజ, మార్కెటింగ్ అధికారి నాగరాజుపాల్గొన్నారు.

మెదక్‌ను సురక్షిత జిల్లాగా మారుద్దాం

- నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర కీలకం
- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ

మెదక్ అర్బన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, మెదక్‌ను సురక్షిత జిల్లాగా మారుద్దామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ నేరాలు జరిగే ప్రాంతాల్లో హాట్‌స్పాట్‌లను ఏర్పాటు చేసి, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. క్రైం మ్యాపింగ్ తయారు చేసి, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి తెలియజేశారు. ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతీ విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వివిధ కేసులలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ రివార్డులతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, జిల్లా సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల జోనల్ క్రీడోత్సవాలు



మెదక్‌లో బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు, ఖేడ్‌లో బహుమతిని అందజేస్తున్న డీఎస్పీ, ఆర్డీవో

మెదక్ అర్బన్/నారాయణఖేడ్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల పదవ జోనల్‌స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. మెదక పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మైదానంలో, నారాయణఖేడ్‌లోని గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతుండగా గురువారం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మెదక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ఐదు జిల్లాలోని 13 పాఠశాలలు పాల్గొన్నగా మెదక్, తూప్రాన్, కొల్చారం, హుజురాబాద్, అలుగునూర్, బద్దెనపల్లి, చిన్నబోనాల, చింతకుంట, చొప్పదండి, నర్మాల, రామాయంపేట, వేములవాడ క్రీడాకారులు వివిధ స్థానాల్లో బహుమతులు అందుకున్నారు. నారాయణఖేడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, డీఎస్పీ వెంకటరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో 11 గురుకులాలకు చెందిన క్రీడా కారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జాయ్ ఆఫ్ గివింగ్'

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14 : వ్యాపార మెలకువలే కాదు.. సామాజిక బాధ్యతను చాటేలా పటాన్‌చెరు పరిధిలోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎంబీఏ విద్యార్థులు గురువారం 'జాయ్ ఆఫ్ గివింగ్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని, గాజులరామారంలోని కేర్ ఎన్ లవ్ అనాథాశ్రమానికి చెందిన 44 మంది చిన్నారులు, ఇద్దరు సిబ్బందిని గీతంకు ఆహ్వానించి, రోజంతా వారితో ఆడిపాడారు. చిన్నారులకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పలు వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిన్నారులందరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, బీస్కూల్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు ఆటలాడిస్తున్న గీతం విద్యార్థులు

దేశం మరువని దార్శనికుడు జవహర్‌లాల్ నెహ్రూ

- కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్


నివాళులర్పిస్తున్న నీలం మధు, తదితరులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 14, (ఆంధ్రజ్యోతి) : దేశ తొలి ప్రధానిగా, రాజనీతిజ్ఞుడుగా అభివృద్ధికి పునాది వేసిన, దేశం మరువని దార్శనికుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం చిట్కుల్లోని ఆయన క్యాంపు కార్యాలయంలో చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తొలి ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో మహోజ్వల ప్రగతి సాధించేలా పాలన కొనసాగించారన్నారు. పంచవర్ష ప్రణాళికలను రూపొందించి ఆధునిక భారతం అభివృద్ధిలో దూసుకుపోయేలా కృషి చేశారన్నారు. మహానేత జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. నెహ్రూ స్ఫూర్తితో తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్వీర్యమైన రంగాలను ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నదన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు చేగుంట విద్యార్థిని ఎంపిక



విద్యార్థి దివ్య

చేగుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చేగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి దివ్య జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారని పీడీ శారద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న మేడ్చల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలికల అండర్-17 విభాగం రగ్బీ పోటీల్లో పాల్గొన్న దివ్య ప్రతిభ చూపగా, జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికచేశారని తెలిపారు. దివ్యను మండల విద్యాధికారి నీరజ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్‌పోటీలకు నర్సాపూర్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

నర్సాపూర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ గిరిజన గురుకుల విద్యాలయానికి చెందిన పదిమంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు గురువారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. సిద్దిపేటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల బేస్‌బాల్ పోటీలలో నర్సాపూర్ గిరిజన గురుకులానికి చెందిన 20 మంది పాల్గొనగా అందులో పదిమంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కిషోర్, పీడీ లక్ష్మణ్, పీఈటీ రాజు, లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లి సమీపంలో రాజీవ్ రహదారి పక్కన కంకులు, జామకాయల విక్రయం

రాజీవ్ రహదారి.. ఉపాధి దారి

- రోడ్డు పక్కన చిరువ్యాపారాలకు అడ్డా
- పండ్లు, కంకుల విక్రయంతో జీవనం
- రోజుకు రూ.500 వరకు సంపాదన

కుకునూరుపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారి పలు కుటుంబాలకు ఉపాధి మార్గంగా మారింది. వివిధ గ్రామాల శివారులో రోడ్డుకు ఇరువైపులా మొక్కజొన్న, జామకాయలు, పలు రకాల పండ్లను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రత్యేకంగా సీజనల్ పండ్ల విక్రయాలు రాజీవ్ రహదారి వెంట జోరుగా సాగుతాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రోడ్డులో దుద్దెడ టోల్‌గేట్ దాటి నుంచి ములుగు మండలం వంటిమామిడి వరకు రోడ్డు పక్కన చెట్ల ఆకులు, కవర్లు కప్పి వేసుకున్న పాకలలో ఎంతో మంది విక్రయిస్తూ కనిపిస్తుంటారు. కుకునూరుపల్లి సమీపంలో రామచంద్రాపూర్, కొడకండ్ల, చిన్నకిష్టాపూర్ గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి ఉపాధి పొందుతున్నారు. ఈ గ్రామాల నుంచి దాదాపు 80 కుటుంబాల వరకు కుకునూరుపల్లి వద్ద చిరువ్యాపారాలు చేస్తూ బతుకుతున్నారు. ఒక్కొక్కరు ప్రతీరోజు సగటున రూ.500 వరకు సంపాదిస్తున్నారు. రోడ్డుపక్కన ప్రమాదం అని తెలిసినా పొట్టతిప్పలకు తప్పడం లేదు. రోడ్డుపై నుంచి వేగంగా వెళ్లే వాహనాల నుంచి వచ్చే పొగ, దుమ్ము ధూళితో సహవాసం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో పాటు కంకులను కాల్చేటప్పుడు వచ్చే పొగతోనూ ఇబ్బంది తప్పదు. అయితే, వర్షం పడుతున్నప్పుడు వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. పాతూరు రాజీవ్ రహదారి పక్కన రైతుల కోసం ఏర్పాటు చేసిన మినీ మార్కెట్‌యార్డ్‌లాగా ఇక్కడ కూడా ఏర్పాటు చేస్తే మరింత మంది ఉపాధి పొందవచ్చు.

నాలుగేళ్లుగా ఇదే పని



మక్క బుట్టలు కాల్చి అమ్మడం, పలు రకాల పండ్లు విక్రయిస్తుంటా. నాలుగేళ్లుగా ఇదే పని చేస్తున్నాను. వ్యవసాయం చేద్దామంటే భూమి లేకపోవడంతో ఇదే ప్రధాన వృత్తి అయింది.

\- కొయిత లక్ష్మి, కుకునూరుపల్లి

రూ.500 వరకు సంపాదన



ప్రతీ రోజు పండ్లు అమ్మడం ద్వారా రూ. 500 వరకు సంపాదిస్తాం. భార్యాభర్తల ఇద్దరం కొన్నేళ్లుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నాం.

\- మల్లం రామవ్వ, చిన్నకిష్టాపూర్



పండ్లను కొనుగోలు చేసేందుకు నిలిపిన వాహనాలు

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



సత్యనారాయణ(ఫైల్)

టేక్మాల్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన టేక్మాల్ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామస్థుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ(36) ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారి 1033 అంబులెన్స్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం పనికి వెళ్లకుండా, మధ్యాహ్నం సమయంలో ఇంట్లో తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన తన కుమారుడు చూడగా ఫ్యాన్‌కు వేళాడి ఉన్నాడు. కుటుంబసభ్యులకు తెలపగా అప్పటికే మృతిచెందాడు. తనకు అప్పులు ఎక్కువయ్యాయని, తీర్చలేకపోతున్నానని మనోవేదనకు గురయ్యేవాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హాస్టల్ భవనంపై నుంచి పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు



ఖేడ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

నారాయణఖేడ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): హాస్టల్ భవనంపై నుంచి పడి ఓ విద్యార్థిని తీవ్ర గాయాలపాలైన ఘటన గురువారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎస్సీ వసతి గృహంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పెద్దశంకరంపేట మండలం జూక్కల్‌కు చెందిన మాధవి(17) నారాయణఖేడ్‌లోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటుంది. గురువారం ఉదయం మాధవి ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు, హాస్టల్ సిబ్బంది చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో చేర్పించారు. విద్యార్థిని నడుము, కాళ్లు, చేతులకు బలమైన గాయాలు తగిలాయని, మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి వైద్యశాలకు తరలించాలని అక్కడి డ్యూటీ డాక్టర్లు సూచించారు. విద్యార్థిని మాధవిని హాస్టల్ సంక్షేమాధికారిణి రజితను తోడుగా ఉంచి సంగారెడ్డి వైద్యశాలకు తరలించామని జిల్లా సహాయ సాంఘిక సంక్షేమాధికారి శ్రీనివాస్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తి నష్టం

నారాయణఖేడ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : షార్ట్‌సర్క్యూట్‌తో ఓ కిరాణ దుకాణం దగ్ధమైన సంఘటన నారాయణఖేడ్ మండలంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. ర్యాకల్‌కు చెందిన కద్పల్ నర్సింలుకు గ్రామంలో కిరాణం దుకాణం ఉన్నది. రోజులాగే బుధవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఆయన ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున కిరాణ దుకాణం నుంచి పొగవస్తుండడంతో స్థానికులు నర్సింలుకు సమాచారం అందించారు. తెరిచి చూడగా మంటలు ఉండడంతో నీటిని చల్లి ఆర్పివేశారు. ఈ ఘటనలో దుకాణంలో ఉన్న టీవీ, ఫ్రిజ్, కిరాణ సామగ్రి మొత్తం కాలిబూడిదైంది. రూ.4 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. కిరాణ దుకాణమే తన కుటుంబ జీవనాధారమని, దుకాణం దగ్ధంతో బతుకుదెరువు కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు అంజాగౌడ్, మాజీ సర్పంచు అంజయ్య తదితరులు దుకాణాన్ని పరిశీలించి బాధితుడిని ఓదార్చారు.

ఇది నా థర్డ్ ఇన్నింగ్స్

5వ పేజీ తరువాయి

పద్మభూషణ్ మాత్రమేనని, ఇంకా పద్మవిభూషణ్ అందుకోలేదని సరదాగా వివరణ ఇచ్చారు. తన తొలిమ్యాచ్‌లో వెస్టిండిస్ క్రికెటర్ సోమర్స్ క్యాచ్ వదిలేయడం వల్ల హాఫ్ సెంచరీ చేశారని, అదే స్ఫూర్తితో దేశానికి 17 ఏళ్ల క్రికెట్ ఆడానని చెప్పారు. లేదంటే ఏదో ఉద్యోగంలో జాయినై ఈపాటికి రిటైర్మెంట్ కూడా తీసుకునేవాడినని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న సునీల్‌గవాస్కర్

గవాస్కర్‌కు సంస్కారం ఎక్కువ

\- సత్యసాయి సంజీవని ఆసుపత్రుల చైర్మన్ శ్రీనివాస్

1980 జనవరిలో సునీల్ గవాస్కర్‌తో తనకు పరిచయమైందని సత్యసాయి సంజీవని ఆసుపత్రుల చైర్మన్ శ్రీనివాస్ గుర్తుచేశారు. నాడు చెన్నైలో వెస్టిండీస్‌తో మ్యాచ్ జరిగిన అనంతరం గవాస్కర్ తనకు ఫోన్ చేశారని పేర్కొన్నారు. సత్యసాయిబాబాను దర్శనం చేసుకుంటానని అడగడంతో తన ద్వారానే బాబాను కలిశారని నెమరువేసుకున్నారు. పుట్టపర్తిలోని స్టేడియం నిర్మాణానికి కూడా గవాస్కర్ సహకరించారని, ఆ నాడు స్టేడియంలో అడుగుపెట్టే సమయంలో బూట్లు విడిచి మోకాళ్లపై కూర్చొని మైదానానికి నమస్కరించారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి ట్రస్టులో సభ్యుడిగా ఉండడమేగాకుండా తనవంతు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి సంజీవని ఆసుపత్రిని తాము మానవసేవా కేంద్రంగా పరిగణిస్తామని ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇక్కడ చిన్నపిల్లల హృద్రోగ రీసర్చ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతానికి ఎంతో ఉపయోగం ఉంటుందని నాటి మంత్రి హరీశ్‌రావు చొరవ చూపించారని గుర్తుచేశారు. ఇక్కడ స్థలం కేటాయించడంతో పాటు ప్రభుత్వ పరంగా సహాయసహకారాలు అందించారని తెలిపారు. మరో 3 రోజుల్లో శస్త్ర చికిత్సలు ప్రారంభిస్తామని తెలిపారు. వైద్యపరంగా చిన్నారుల గుండె సర్జరీలే అత్యంత కష్టమైనవని వివరించారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ హార్ట్ స్క్రీనింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని నాడు హరీశ్‌రావు కోరారని గుర్తుచేశారు.



సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న గవాస్కర్

ప్రభుత్వాలు మారినా రైతుల బతుకులు మారలేదు

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

కంది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా రైతుల బతుకుల్లో మార్పు రాలేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోనూ మల్లన్నసాగర్ ప్రాంత రైతులను అర్థరాత్రి అరెస్టులు చేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పారిశ్రామికవాడ పేరుతో రాత్రిపూట అరెస్టులు చేసి ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అప్పటి సీఎం కేసీఆర్ గజ్వేల్ గడా పేరు పెడితే, ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు కుడా పేరు తీసుకొచ్చారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనైనా, కాంగ్రెస్ పాలనైనా వ్యక్తులు మారారే తప్ప.. రైతుల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి అమ్ముకుందామని ఖమ్మంయార్డు వెళ్లిన రైతుల్ని అరెస్ట్ చేసినప్పుడు రంకెలేసిన రేవంత్‌రెడ్డి, మల్లన్నసాగర్‌లో అర్ధరాత్రిపూట ఊర్లను ఖాళీ చేయిస్తుంటే నిరహార దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక లగిచర్లలో రాత్రిపూట రైతులను ఎందుకు అరెస్ట్ చేయిస్తున్నారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు జరగకుండా రైతులు ఇబ్బందులు పడుతుంటే నాయకులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, మెదక్ పార్లమెంట్ కన్వీనర్ సంగమేశ్వర్, నాయకులు ఉన్నారు.

ఇంట్లో నుంచి వెళ్లి.. చెట్టుకు ఉరేసుకుని

సంఘ్యు తండాకు చెందిన మహిళ మృతి.. ఆలస్యంగా వెలుగులోకి

టేక్మాల్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి) : ఇంట్లో నుంచి వెళ్లిపోయిన మహిళ పొలంలో ఉరేసుకుని కనిపించిన సంఘటన టేక్మాల్ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, తండావాసులు తెలిపిన వివారల ప్రకారం.. మండలంలోని సంఘ్యు తండాకు చెందిన కెతావత్ సత్యమ్మ(65) తండాలో ఉంటూ జీవనం సాగిస్తుంది. ఆదివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తండా శివారులో ఆవులను మేపేందుకు వెళ్లిన వారు వ్యవసాయ క్షేత్రం వద్ద వేపచెట్టుకు సత్యమ్మ ఉరేసుకుని కనిపించింది. ఇది గమనించిన వారు కుటుంబసభ్యులకు తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులు టేక్మాల్ పోలీసులకు సమాచారం అందిచగా సంఘటన స్థలానికి చేరుకుని పంచనమా నిర్వహించారు. సంగారెడ్డి ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కుమారుడు వసంత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చెసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నాగ్‌సాన్‌పల్లిలో అఘోరీ కారు వద్ద జనం

రాయిలపూర్ మల్లన్న ఆలయానికి అఘోరీ

కౌడిపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా వివిధ ఆలయాలు దర్శనం చేసుకుంటూ తిరుగుతున్నా అఘోరీ(నాగసాధువు) గురువారం పాపన్నపేట మండలంలోని ఏడుపాయల అమ్మవారిని దర్శనం చేసుకున్నది. తన కారులో తిరుగు ప్రయాణంలో కౌడిపల్లి మండలంలోని రాయిలపూర్ మల్లికార్జునస్వామి ఆలయానికి చేరుకున్నది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అఘోరీని చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అఘోరీని జాగ్రత్తగా పంపించారు. అఘోరీ కారులో పుర్రెలు, ఎముకలు చూసిన స్థానికులు జైశ్రీరాం నినాదాలు చేయగా, అఘోరీ కారులో నుంచి దిగి అక్కడ ఉన్న వారిని కలసి వెళ్లారు.

జహీరాబాద్ ప్రాంత రోడ్ల అభివృద్ధికి కృషి

- రూ.5 కోట్లతో అధునాతన హంగులతో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నిర్మిస్తాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జహీరాబాద్, నవంబరు 14 : జహీరాబాద్ ప్రాంతంలోని రోడ్ల అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి హైదరాబాద్ నుంచి సంగారెడ్డి జిల్లా మీదుగా గురువారం వెళ్తుండగా.. జహీరాబాద్ పట్టణంలో ఆయన కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. రూ.15 కోట్లతో చిరాగ్‌పల్లి-మన్నాపూర్ వరకు, రూ.32 కోట్లతో జహీరాబాద్-ఎల్గొయి, రూ.25 కోట్లతో అసద్‌గంజ్ నుంచి కాశీంపూర్ మీదుగా జహీరాబాద్‌కు రోడ్లను అభివృద్ధి చేయనున్నామన్నారు. అలాగే జహీరాబాద్ పట్టణంలో రూ.5 కోట్లతో కొత్త హంగులతో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని మంత్రి ఆదేశించారు. వికారాబాద్ - జహీరాబాద్ మధ్యలో జాతీయరహదారిని నిర్మించనున్నట్లు చెప్పారు. జహీరాబాద్‌లో ఇంటిగ్రెటేడ్ హాస్టల్ యూనివర్సిటీ తరహాలో నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన పార్టీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ రోడ్ల పరిస్థితిపై ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సమస్యలు పరిష్కరించాలని వినతి

జహీరాబాద్ పట్టణానికి వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మాజీ కౌన్సిలర్ రాములు నేత రాష్ట్రంలో సమాచారశాఖ కమిషనర్‌ను నియమించాలని వినతిపత్రం అందజేశారు. అలాగే ఉర్దూ మీడియం విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, బ్యాక్‌లాగ్ చేసిన పోస్టులను డీరోస్టర్ చేసి మెరిట్ అభ్యర్థుల ద్వారా భర్తీ చేయాలని, ఉర్దూ మీడియం పాఠశాలలు మూత పడకుండా చూడాలని పలువురు అభ్యర్థులు, ఉపాధ్యాయులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల గెస్ట్‌లెక్చరర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, రెగ్యూలర్ లెక్చరర్లతో సంబంధం లేకుండా యథావిధిగ కొనసాగించాలని పలువురు గెస్ట్ లెక్చరర్లు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

మాజీ సర్పంచ్ కుమారుడిపై గుర్తుతెలియని వ్యక్తుల హత్యాయత్నం?

- తొగుట మండలం లక్ష్మాపూర్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి



గాయాలతో రాజు(ఫైల్)

తొగుట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : తొగుట మండలంలోని లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కుమారుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి చంపడానికి ప్రయత్నించిన సంఘటన మూడు రోజుల క్రితం జరుగగా ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత కుటుంబీకుల, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మాజీ సర్పంచ్ పిట్ల శ్రీనివాస్, భూమి మల్లన్నసాగర్‌లో ముంపునకు గురికావడంతో లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో భూమిని కొనుక్కుని, ఇల్లు కట్టుకుని ఉంటున్నారు. గ్రామంలో లేనివారికి పరిహారం అందిందని మాజీ సర్పంచ్ పిట్ల శ్రీనివాస్ ఇటీవల బాహాటంగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విషయమై అతడి కొడుకు రాజు(38) సోషల్‌మీడియాలో పోస్టు పెట్టడంతో గ్రామంలో పంచాయితీ జరిగింది. ఈ విషయంలో వారిపై కక్ష పెంచుకున్న కొందరు శ్రీనివాస్ కొడుకు రాజును చంపడానికి ప్రయత్నించారు. ఈనెల 11న సాయంత్రం రాజు గ్రామంలోని వ్యవసాయ పొలం వద్ద ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు రెండు బైక్‌లపై వచ్చి బీరు సీసాలతో దాడి చేయగా, తీవ్ర రక్తస్రావంతో రాజు సొమ్మసిల్లి పడిపోవడంతో చనిపోయాడని అనుకుని పారిపోయారు. కొద్దిసేపటి తర్వాత రాజుకు మెలుకువ రావడంతో అక్కడి నుంచి మెల్లిగా లేచి ఇంటికి చేరుకోగా అతడిని వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిసింది. ఈ విషయమై తొగుట పోలీసుస్టేషన్‌లో అనుమానిత వ్యక్తులపై మాజీ సర్పంచ్ పిట్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. దాడి చేసిన కొందరిని సీసీ కెమరాల ద్వారా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనకు సూత్రదారులు పరారీలో ఉన్నట్లు తెలిసింది. విచారణ చేస్తున్నామని తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు.

చిన్నారుల గుండెకు అండ

- అడ్మిట్ నుంచి డిశ్చార్జి వరకు అన్నీ ఉచితమే
- కొండపాకలోని శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో సకల సౌకర్యాలు
- ఆస్పత్రిని సందర్శించి ట్రస్టు సభ్యుడు, టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్



ఆస్పత్రిలోని వార్డులను పరిశీలిస్తున్న సునీల్ గవాస్కర్, తదితరులు

సిద్దిపేట టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని కొండపాకలో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి సంజీవనీ అసుపత్రి, పరిశోధన కేంద్రం చిన్నారుల గుండెకు అండగా నిలవనుంది. గుండెకు రంధ్రం పడడంతో శస్త్రచికిత్సకోసం వచ్చిన చిన్నారులను గురువారం మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఆప్యాయంగా పలకరించి, బాలల దినోత్సవం సందర్భంగా వారికి చాక్లెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. నయా పైసా చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసుపత్రిలో అడ్మిట్ నుంచి డిశ్చార్జి వరకు అన్నీ ఉచితంగానే చేస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడారు.



సత్యసాయి సంజీవని ఆస్పత్రి

ఫోన్ చేసి రమ్మన్నారు



బీహార్‌కు చెందిన మాకు దీక్షితకుమారి (6) అనే కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం సికింద్రాబాద్‌లోని చర్లపల్లిలో నివసిస్తున్నాం. గతేడాది నుంచి చిన్నారికి అనారోగ్య సమస్యలు రావడంతో హైదరబాద్‌లోని పలు ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించాం. చిన్నారి గుండెకు రంధ్రం ఉందని వైద్యులు వెల్లడించారు. ఇటీవలే నీలోఫర్ ఆసుపత్రిలో చిన్నారికి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రి పరిశోధన కేంద్రం నుంచి సంబంధిత ఉద్యోగి కాల్ చేసి ఇక్కడ ఆసుపత్రిలో అడ్మిట్ కావాలని సూచించారు.

- అంజన్‌కుమార్, నిర్మలకుమారి దంపతులు, సికింద్రాబాద్

ఆర్థిక స్థోమత లేకపోవడంతో..



మాది మేడ్చల్ జిల్లాలోని కీసర. మాకు 15 నెలల ప్రణయ్‌కుమార్ అనే కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా వాడికి అనారోగ్య సమస్యలు వస్తుండడంతో వైద్యుడిని సంప్రదించాం. పరీక్షించిన వైద్యులు గుండెకు రంధ్రం పడిందని, వెంటనే ఆపరేషన్ చేయాలని తెలిపారు. ఆర్థికస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లాం. సిద్దిపేట జిల్లాలోని కొండపాక వద్దనున్న శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రి పరిశోధన కేంద్రానికి వెళ్లాలని వారు సూచించారు.

- వెంకటేష్, మాధవి, కీసర, మేడ్చల్ జిల్లా

రాజస్థాన్ నుంచి వచ్చాం



మా స్వస్థలం రాజస్థాన్ జీవనోపాధి కోసం హైదరబాద్‌కు వచ్చాం. మా 3ఏళ్ల కుమారుడు లక్షిత్‌శర్మకు కొన్ని నెలలుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రాజస్థాన్‌కు వెళ్లాం. అక్కడే ఉంటూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నాం. తెలిసిన బంధువులు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్‌లో శ్రీసత్యసాయి సంజీవని ఆసుపత్రి పరిశోధన కేంద్రానికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి హైదరబాద్‌కు దగ్గరలో ఉన్న శ్రీ సత్యసాయి సంజీవని ఆసుపత్రి పరిశోధన కేంద్రానికి వచ్చాం.

- సురేష్‌శర్మ, సుశీలశర్మ దంపతులు

అంజీయోగ్రామ్ అవసరముంది



ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామం మాది, మాకు 3ఏళ్ల వయసున్న ఆదిత్య అనే కుమారుడు ఉన్నాడు. వాడి ఆరోగ్యం విషయంలో రోజురోజుకు మార్పు వస్తుండడంతో వైద్యులను సంప్రదించాం. పరిక్షించిన వైద్యులు గుండె సమస్యతో బాధపడుతున్నాడని అంజియోగ్రామ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో కొందరి సూచన మేరకు ఇక్కడికి వచ్చిన తరువాత మా కుమారుడికి త్వరగా నయమవుతుందన్న నమ్మకం కలిగింది.

- కవిత, మదన్‌కుమార్, ఆదిలాబాద్

నేటి బాలలే.. రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని ఉపాధ్యాయులు అన్నారు. భారత మాజీ ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో స్వయం పరిపాలన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఉపాధ్యాయుల మాట్లాడుతూ.. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మనిచ్చిన తల్లిని, పుట్టిన ఊరిని మరువకూడదన్నారు. పలుచోట్ల వివిధ పార్టీల నాయకులు నెహ్రూ విగ్రహానికి, చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు.

– న్యూస్ నెట్‌వర్క్



చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



దూళిమిట్ట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం సందర్భంగా వివిధ వేషధారణల్లో చిన్నారులు



జగదేవ్‌పూర్: తిగుల్ పాఠశాలలో బాలల దినోత్సవంలో విద్యార్థులు



గజ్వేల్ రూరల్: సింగాటంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు



తొగుట: సయ్యద్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ పట్టింపేదీ?

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వ పట్టింపు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నియోజకరవ్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వేగవంతంగా కొనుగోళ్లు చేపట్టకపోవడం వల్ల ధాన్యం దళారులపాలైందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు సూరంపెల్లి పరుశురాములు, వర్షినాయక్, సత్యం నాయక్, జేరిపోతుల లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- సిద్దిపేట ఏడీఏ పద్మ

సిద్దిపేట రూరల్,నవంబరు 14(ఆంధ్రజ్యోతి); వాణిజ్య పంటల్లో భాగంగా ఆయిల్‌పామ్ తోటలకు అంతర్జాతీయ స్థాయిలో భారీ డిమాండ్ ఉందని, ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని ఏడీఏ పద్మ అన్నారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, జక్కాపూర్, గోపులాపూర్, నారాయణరావుపేట గ్రామాల్లోని ఆయిల్‌పామ్ తోటలను ఏవో పరశురాంరెడ్డి, ఏఈవోలతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులకు యాజమాన్యం పద్ధతుపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై డ్రిప్‌ను అందిస్తుందని వెల్లడించారు. ఆయిల్‌పామ్ సాగు చేసిన మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకు అంతరపంటలైన వేరు శనగ, పెసర, మొక్కజొన్న, ఇతర పప్పు దినుసుల పంటలు, సాగు చేసుకోవచ్చుని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు స్పందన, మౌనిక, వరుణ్, పాల్గొన్నారు.



సిద్దిపేట రూరల్: ఆయిల్‌పామ్ తోటలను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మ, ఏవో పరుశురాంరెడ్డి

- చిన్నకోడూరు: ఆయిల్‌పామ్ ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి జయంత్ కుమార్ అన్నారు. మండలంలోని గంగాపూర్‌లో ఓ రైతు సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను పరిశీలించి కలుపు, ఎరువులు, నీటి యాజమాన్యం గురించి రైతుకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతోనే పరిపూర్ణ వికాసం



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అంజూమ్

గజ్వేల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తకపఠనంతోనే పరిపూర్ణ వికాసమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక కాలంలో యువత సెల్‌ఫోన్, ఇంటర్నెట్, టీవీ, సినిమా వంటి మాధ్యమాలకు బానిసలై పెడదోవపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెవెంట వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్లు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్, అధ్యాపకులు మహేందర్, అలివేలు, రామచంద్రం, విజయభాస్కరొరెడ్డి, లక్ష్మీనర్సయ్య, పెద్దిరాజు, మార్కండేయ, వెంకటరమణ, చాంద్, ఖలీల్ తదితరులున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

చేర్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజన చార్జీలను కూడా పెంచాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొమురవెల్లి ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం సరిపడక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవోకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విక్రమ్, సమీర్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

రైతుల సంక్షేమం కోసం కృషి

- ప్యాక్స్ చైర్మన్ హరికృష్ణరెడ్డి



హుస్నాబాద్‌లో జెండా ఎగురవేస్తున్న చైర్మన్ శివయ్య

తొగుట, నవంబరు14(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తొగుట ప్యాక్స్ చైర్మన్ హరికృష్ణరెడ్డి అన్నారు. 71వ అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా గురువారం తొగుట సొసైటీ కార్యాలయం ఆవరణలో జెండాను ఎగురవేసి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి సొసైటీ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, డైరెక్టర్ నారాయణరెడ్డి, సీఈవో గంగారెడ్డి, కార్యాలయం సిబ్బంది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- కోహెడ: సహకార వారోత్సవాల సందర్భంగా కోహెడ సహకార సంఘంలో పీఏసీఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి బాలరాజు, పాలకవర్గ సభ్యులు మ్యాకల సురేందర్‌రెడ్డి, నీరటి దేవయ్య పబ్బతి సుగుణమ్మ, జేరిపోతుల మణెమ్మ, గొంటి లక్ష్మయ్య, కొత్తూరు మనోహర్, బద్దం కొండారెడ్డి, బొబ్బల కొండాల్‌రెడ్డి, సీఈవో ముంజ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.



మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు గురువారం కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే క్షేత్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

- వర్గల్



కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో నక్షత్ర ఆకారంలో ప్రత్యేక అలంకరణ జరిపి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. విష్ణు, నారాయణ సూక్త పారాయణం చేపట్టారు. భక్తులు దేవదేవుల నామస్మరణతో పులకించారు.

- చేర్యాల

ప్రైవేటుకు దీటుగా ఆర్అండ్ఆర్ పాఠశాల

- డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఆర్అండ్ఆర్ ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దనున్నట్లు సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయనవెంట ఎంఈవో కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు కరీమోద్దీన్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

- కొండపాక: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని డీఈవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని దుద్దెడ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కొండపాకలోని వేద ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన ఫుడ్‌ఫెస్టివల్‌ను డీఈవో ప్రారంభించారు.



కొండపాక: దుద్దెడలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో

భార్యతో గొడవపడి.. భర్త ఆత్మహత్య

దుబ్బాక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి భర్త గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి దుబ్బాకలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనారావుపేట మండలం కొండాపూర్‌కు చెందిన గంట నక్క దుర్గయ్య, సోదరుడు గంట కర్రె నక్క ఎల్లయ్యలు కుటుంబసభ్యులతో కలిసి దుబ్బాకకు గంగిరెద్దులను తీసుకుని ఈనెల 4న బిక్షాటనకు వచ్చారు. దుబ్బాకలోని మల్లయపల్లి రోడ్డులోని విద్యుత్‌సబ్‌స్టేషన్ సమీపంలో గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. బుధవారం రాత్రి గంట నక్క దుర్గయ్య కుమారుడు గంట లచ్చయ్య(23) భార్యతో గొడవకు దిగి ఆవేశంగా కల్లులో గడ్డిమందును కలుపుకుని తాగాడు. అతడిని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లరెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

చేర్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం తెల్లవారుజా మున కారు అదుపుతప్పి బోల్తాపడింది. పట్టణానికి చెందిన ఇరువురు యువకులు కారులో ఆర్టీసీ బస్టాండ్ సమీపం నుంచి యూటర్న్ చేస్తున్న క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన విద్యుత్‌స్తంభాన్ని ఢీకొని బోల్తాపడగా, యువకులు తృటిలోప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ బీజేపీ

- మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ నలగామ శ్రీనివాస్



మాట్లాడుతున్న నలగామ శ్రీనివాస్

గజ్వేల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీ అని మెదక్ పార్లమెంట్ కోకన్వీనర్ నలగామ శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ బీజేపీ కార్యశాలను పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ అధ్యక్షతన గురువారం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సభ్యత్వాల పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ అని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిత్యం పనిచేస్తుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు వస్తాయన్నారు. ఆయన వెంట నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, ఉప్పల మధుసూదన్, మహేందర్, వెంకట్, నాయిని సందీప్, వడ్డేపల్లి ప్రసాద్, మాద్గూరి నరసింహ, చెప్యాల వెంకట్‌రెడ్డి, నాగులు ముదిరాజ్ తదితరులున్నారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు'

చిన్నకోడూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మీసం నాగరాజు యాదవ్, చింతల రాజ్‌వీర్ ఆరోపించారు. చిన్నకోడూరులో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో అధికారుల పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకుల ప్రోత్సాహంతోనే అధికారులపై దాడి జరిగిందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్, జయంత్, రాజు, స్వామి పాల్గొన్నారు.

గజ్వేల్ పట్టణంలో మధుమేహ దినోత్సవ ర్యాలీ



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

గజ్వేల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మధుమేహ వ్యాధిగ్రస్థుల దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు నాగమునెయ్య మాట్లాడుతూ.. చెక్కర, మైదా, బియ్యం, ఉప్పు, పాలు మొదలైన ఆహార పదార్థాలు మితంగా వాడాలని సూచించారు. ప్రతీరోజు తప్పనిసరిగా 45 నిమిషాలు వాకింగ్ చేయాలని సూచించారు. ఆయనవెంట ఐఎంఏ సభ్యులు ఎలిశాల లింగం, వైద్యులు నవ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, శారద, ఉమా, మేహరాజ్, గౌతమ్, శశికళ, రేఖ, ఫార్మసిస్టు నర్సింహులు, వైద్య సిబ్బంది వాసుదేవ్, రమేశ్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

- హుస్నాబాద్: ప్రపంచ డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద ఓ ఆస్పత్రి ఆధ్వర్యంలో రన్నర్స్, స్విమ్మర్స్‌కు మధుమేహంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పిట్ల రాజు, డాక్టర్ అనిత తదితరులున్నారు.

గ్రంథాలయాలను పటిష్ఠం చేయాలి

- చైర్మన్‌కు యువకుల వినతి

మిరుదొడ్డి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని వివిధ గ్రామాలల్లో ఉన్న గ్రంథాలయాలను పటిష్ఠం చేయాలని జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ కేడం లింగమూర్తికి గురువారం పలువురు యువకులు వినతిపత్రం అందజేశారు. గ్రంథాలయాల్లో మౌలిక వసతులను కల్పించాలని, డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చాలని ఈ సందర్భంగా వారు కోరారు. పోటీపరీక్షలకు యువత సిద్ధమవ్వడానికి పోటీ పరీక్షల పుస్తకాలు, నెలనెల వచ్చే విజేత పుస్తకాలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో యువజన సంఘాల కన్వీనర్ సూకురి ప్రవీణ్, కీసరి స్వామి, వడిచెర్ల వెంకటేష్ తదితరులున్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే సహించం

- కర్కపట్ల గ్రామస్థులు

మర్కుక్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ నిర్వాహకులు ఆలయానికి చెందిన భూములను ఆక్రమిస్తే సహించేదిలేదని మర్కుక్ మండలం కర్కపట్ల గ్రామస్థులు హెచ్చరించారు. మండలంలోని కర్కపట్ల పారిశ్రామికవాడలో ఉన్న మత్తడి మైసమ్మ ఆలయం చుట్టూ ఓ పరిశ్రమకు చెందిన నిర్వాహకులు ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్థులు అభ్యంతరం తెలుపుతూ ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం, గజ్వేల్ గ్రామీణ సీఐ మహేందర్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, మేనేజర్ విజయ, మర్కుక్ తహసీల్దార్ ఆరిఫా, ఎస్ఐ దామోదరలు ఘటన స్థలానికి వెళ్లారు. గ్రామస్థులతో, పరిశ్రమ నిర్వాహకులతో ఆలయ భూముల గురించి చర్చించారు. ఆలయానికి సంబంధించిన కొంత భూమిని వదిలిపెట్టి మిగతా భూమిలో ప్రహరీ నిర్మించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ప్రతిపాదనను పరిశ్రమ నిర్వాహకులు ఒప్పుకోలేదు. దీంతో గ్రామస్థులు, పరిశ్రమ నిర్వాహకులు మర్కుక్ తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి అధికారులు సమావేశం నిర్వహించారు. సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని అందరూ ఈ విషయంలో సంయమనం పాటించాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం సూచించారు. సమస్యను టీజీఐఐసీ ఎండీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అధికారులు చెప్పడంతో అందరూ వెళ్లిపోయారు.

నేడు సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో కార్తీక పౌర్ణమి

కోహెడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారెడ్డిపల్లి సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో నేడు కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు అనంతవరం మాణిక్యలింగం తెలిపారు. సిద్ధప్ప వరకవి విగ్రహం వద్ద పూజతోపాటు, సరస్వతి ఆలయం వద్ద గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

'బస్సు సౌకర్యం కల్పించండి'

దూళిమిట్ట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి దూళిమిట్ట మండల కేంద్రం మీదుగా తరిగొప్పుల మండల కేంద్రం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోల సాయిలుగౌడ్ అధ్వర్యంలో సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు.